RNI No: APTEL /25/A2860

సీమ వార్త సాయంకాలం

అనంతపురం | సంపుటి : 1 | సంచిక : 102 | పేజీలు : 4 | బుధవారం 14 అక్టోబర్ 2026 | ఎడిటర్ : బీరే ఈశ్వరయ్య | వెల : 2/-



ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?.. ట్రంప్, నెతన్యాహు మధ్య రహస్య చర్చలు!

రైల్వే ఉద్యోగులకు కేంద్రం పండగ కానుక..

- 78 రోజుల వేతనం బోనస్!
- కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయానికి ఆమోదం
- సుమారు 11.40 లక్షల మంది నాన్-గెజిటెడ్ సిబ్బందికి లబ్ధి
- ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చొప్పున చెల్లింపు
- పనితీరును ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయమన్న రైల్వే శాఖ

యూపీఐ ద్వారా పెన్షన్ ఖాతా..



- తత్కాల్ ఎన్‌పీఎస్ వచ్చేసింది!
- భీమ్ యాప్‌లో తత్కాల్ ఎన్‌పీఎస్ ప్రారంభం
- మూడు దశల్లో పెన్షన్ ఖాతా ఏర్పాటు
- బ్యాంకు శాఖకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సదుపాయం
- కనీస తొలి పెట్టుబడి రూ.250, 18-85 ఏళ్ల అర్హులకు అవకాశం
- ప్రస్తుతం ఆరు బ్యాంకుల ఖాతాదారులకు సదుపాయం



జనసేనలో చేరిన వంగవీటి రాధా

- విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?
- కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్
- విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు
- జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్
- విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం
- కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు

మోగిన నగారా!

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల..

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

తొలి దశ నవంబర్ 26న పోలింగ్

మూడో దశ డిసెంబర్ 2న ఎన్నికలు

మున్సిపల్ ఎన్నికలు ఈ నెల 28న

మున్సిపల్ ఫలితాలు ఈ నెల 30న

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది. తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు - మిగతా 3లో



విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- టీడీపీలోకి వెళ్లిన మేనల్లుడు చిన్న శ్రీనుకు చెక్ పెట్టే వ్యూహం
- బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మారిన సమీకరణాలు
- చిన్న శ్రీను కూడా తన కుమార్తెను బరిలోకి దించనున్నట్లు ప్రచారం



దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నావ్?

- ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో అభిజిత్ దీపేక్‌కు నిరసన సెగ
- దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నావంటూ ఓ వ్యక్తి దీపేక్‌ను నిలదీత
- నవ్వుతూ థమ్సప్ చూపిస్తూ వెళ్లిపోయిన దీపేక్
- సహచరుల అరెస్ట్‌పై కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన దీపేక్
- త్రివర్ణ పతాకం ఎగరేయడం నేరమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన వైనం

నల్గొండకు నీళ్లు ఇవ్వొద్దంటూ సీఎంపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు

- గుత్తా సుఖేందర్ రెడ్డి ఫైర్
- డిండి ప్రాజెక్టుకు నీళ్లు కేటాయించవద్దని అధికారులు చెప్పారని గుత్తా ఆగ్రహం
- ప్రాంతాల మధ్య భేదాలు చూపొద్దని ప్రభుత్వానికి సూచన
- నల్గొండ జిల్లాలో 7 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోందని వెల్లడి




హైదరాబాద్

తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. నల్గొండ జిల్లాకు సాగునీరు అందకుండా అడ్డుకునేందుకు కొందరు అధికారులు ప్రభుత్వంపై, ముఖ్యమంత్రిపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఆరోపించారు. దీనివల్ల జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నల్గొండలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈమేరకు ఆవేదన వ్యక్తం చేశారు. నీళ్లన్నీ పాలమూరుకే కేటాయించాలని, - మిగతా 3లో

హైదరాబాద్‌లో సమాఖ్య బిజినెస్ సమ్మిట్

- రాష్ట్రాభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను చేస్తామన్న సీఎం
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యమని వెల్లడి
- కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలని వ్యాఖ్య



హైదరాబాద్

2047వ సంవత్సరం నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈరోజు 'సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై తమ ప్రభుత్వ దార్శనికతను వివరించారు. ఈ భారీ లక్ష్య సాధనలో భాగంగా 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రగతి ప్రణాళికలు - మిగతా 3లో

దేశం మొత్తం జంతర్ మంతర్‌గా మారుతుంది



- కేంద్ర ప్రభుత్వంపై ప్రకాశ్ రాజ్ ఫైర్
- కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ
- ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడాన్ని సహించబోమన్న ప్రకాశ్ రాజ్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తీపికబురు..

ఒక ఇంటికి అదనంగా రూ.72,000 ఆర్థిక సాయం!

ఈ డేటా ఎంట్రీ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా అదనపు ఆర్థిక సహాయం జమ అయ్యేలా అధికారులు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ సాయంతో పాటు కేంద్రం నుంచి అందే ఈ అదనపు..

బుధవారం 14 అక్టోబర్ 2026

సీమ వార్త

సాయంకాలం

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా



పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



.....70 మందికి రూ.31.43 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన మంత్రి సవిత

28 నెలల్లో 1,461 మందికి రూ.15.75 కోట్ల సాయం

... ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేసిన... మంత్రి సవితమ్మ.





"కలం" వీరుడు..... "రాజు" నటనలో రారాజు..!!



.....శ్రీ సత్యసాయి అవతార వైభవం" చిత్రంలో పుట్టపర్తి వాసికి అవకాశం

.....బాబా చిన్నాన్నగా నటించనున్న సీనియర్ పాత్రికేయుడు యూఎస్ రాజు

....హీరో సుమన్ కు తమ్ముడిగా, ఓం సాయి ప్రకాష్ 109వ చిత్రంలో అవకాశం.

....రత్నాకర్ ఆశీస్సులతో పాత్ర, ఆధ్యాత్మిక వాతావరణంలో షూటింగ్

పుట్టపర్తి, అక్టోబర్ 14 (సీమవార్త సాయంకాలం బ్యూరో) :

భగవాన్ శ్రీ సత్యసాయి అవతార వైభవాన్ని వెండితెరపై ఆవిష్కరించే మహత్తర చిత్రంలో పుట్టపర్తికి చెందిన సీనియర్ పాత్రికేయుడు యూ ఎస్ రాజుకు నటించే సువర్ణావకాశం దక్కింది. ప్రముఖ దర్శకుడు ఓం సాయి ప్రకాష్ దర్శకత్వంలో శరవేగంగా తెరకెక్కుతున్న "శ్రీ సత్యసాయి అవతార వైభవం" చిత్రంలో ఆయన బాబా వారి చిన్నాన్న పాత్రను పోషిస్తున్నారు. శ్రీ బాలామణి ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం భక్తి చిత్రాల చరిత్రలో ఒక బ్లాక్ బస్టర్ గా నిలవనుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. బాబా తండ్రి పాత్రలో ప్రముఖ నటుడు సుమన్, తల్లి పాత్రలో ప్రముఖ నటి ఆమని, బాబా తాతగారైన కొండమరాజు పాత్రలో సీనియర్ నటుడు మురళీమోహన్ నటిస్తున్నారు. ఇలాంటి అతిరథ - మిగతా3లో



పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యం..!!

అనంతలో ఉమ్మడి జిల్లాల జిపిఎఫ్ అదాలత్ మొదటి రోజు కార్యక్రమాలు.

పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆనంద్.



అనంతపురం, అక్టోబర్ 14: సీమ వార్త సాయంత్రం.

ప్రభుత్వ ఉద్యోగులుగా విశేష సేవలందించి పదవీ విరమణ చేసిన పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యత తనిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్- మిగతా3లో





ఎలక్షన్‌పై ఖాకీల డెగ నిఘా..!!

.....ఎన్నికల వేళ పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయాలి.

--స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన.

--....అనంత జిల్లా ఎస్పీ పి. జగదీష్

కళ్యాణదుర్గం, అక్టోబర్ 14 సీమవార్త:సాయంత్రం.

ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కళ్యాణదుర్గం డీఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎన్నికల భద్రత, రూట్ మొబైల్ బృందాల నిఘా, సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు, బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. రౌడీషీటర్లు, అల్లర్లకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని, - మిగతా3లో



సీమ వార్త సాయంకాలం
బుధవారం
14 అక్టోబర్ 2026

“కలం” వీరుడు.....”రాజు” నటనలో రారాజు..!!

-మొదటిపేజీ తరువాయి

మహారథుల సరసన పుట్టపర్తి వాసికి ప్రాధాన్య పాత్ర దక్కడం విశేషం. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న ఓం సాయి ప్రకాష్ సీనియర్ దర్శకుడిగా ఘనమైన ఖ్యాతి పొందారు. ఇది ఆయనకు 109వ దర్శకత్వ చిత్రం కావడం మరో విశేషం. అన్నమయ్య, శ్రీరామదాసు, నమో వెంకటేశాయ, జగద్గురు ఆదిశంకరాచార్య వంటి అనేక విజయవంతమైన భక్తి చిత్రాలకు కథనం అందించిన ప్రముఖ రచయిత జేకే భారవి ఈ చిత్రానికి రచయితగా పనిచేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో 8 రోజుల పాటు జరిగిన షూటింగ్ లో యూఎస్ రాజు తన పాత్రను అత్యంత భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను ఆరాధించే భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి చిత్రంలో బాబా వారి చిన్నాన్న పాత్ర పోషించడం, తాను ఇష్టపడే దర్శక ధీరుడైన ఓం సాయి ప్రకాష్ గారి దర్శకత్వంలో పనిచేయడం, తన అభిమాన హీరో సుమన్ గారికి తమ్ముడిగా నటించే అవకాశం రావడం అంతా భగవాన్ శ్రీ సత్యసాయి



అనుగ్రహమే అని ఉద్వేగంగా అన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ఓం సాయి ప్రకాష్ గారికి, కో-డైరెక్టర్ బిక్షపతి గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షూటింగ్ సమయంలో ఎంతగానో సహకరించిన తోటి నటీనటులకు, సాంకేతిక నిపుణులకు ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ ఆర్.జె. రత్నాకర్ గారి ఆశీస్సులతోనే తనకు ఈ పాత్ర లభించిందని, ఆయన ఆశీస్సులు ఎల్లవేళలా తనకు ఉంటాయని సంతోషం వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుంచి తాను హీరో సుమన్ వీరాభిమానినని, ప్రస్తుతం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా సుమన్ ఫ్యాన్స్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నానని అన్నారు. తన అభిమాన హీరోకు తమ్ముడిగా నటిస్తూ స్క్రీన్ షేర్ చేసుకోవడం ఒక అభిమానిగా తనకు గర్వకారణమని, భగవాన్ సత్యసాయిబాబా వారు కల్పించిన అవకాశంగా తాను భావిస్తున్నట్లు భక్తిపూర్వకంగా వివరించారు. భవిష్యత్తులో మరిన్ని పాత్రలు చేసే అవకాశం లభిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. బాబా వారి చిత్ర నిర్మాణ సమయంలో షూటింగ్ మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతోందని, సెట్స్ లో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ బాబా వారే దగ్గరుండి నడిపిస్తున్నారా అన్న భావన కలుగుతోందని యూఎస్ రాజు అన్నారు.

పెన్షనర్ల సంక్షేమానికి ప్రాధాన్యం..!!

-మొదటిపేజీ తరువాయి

ఓ. ఆనంద్ పేర్కొన్నారు.బుధవారం ఉదయం అనంతపురం జిల్లా కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ మొదటి రోజు కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్), ఆంధ్రప్రదేశ్ శ్రీమతి శాంతి ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ శ్రీ ఎస్. కుశల్ కార్తిక్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ శ్రీమతి ఆశ్రిత నౌపాడ, అనంతపురం జిల్లా ట్రెజరీ డీడీ, శ్రీ సత్యసాయి జిల్లా ట్రెజరీ డీడీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు, పలువురు పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ, ప్రభుత్వ యంత్రాంగంలో విధులు నిర్వహిస్తున్న ప్రస్తుత ఉద్యోగులతో పాటు పదవీ విరమణ చేసిన సిబ్బంది తమ సర్వీసు కాలంలో ప్రభుత్వానికి అందించిన సేవలు ఎంతో అమూల్యమైనవని అన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించడం ప్రతి శాఖ బాధ్యత అని పెన్షనర్ల సేవలను గుర్తించి ఆయా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.గతంలో పెన్షన్ మంజూరు కోసం ఉద్యోగులు ఏజీ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. సీనియర్ సిటిజన్లను గుర్తించి, గౌరవిస్తూ ఏజీ కార్యాలయ అధికారులు క్షేత్రస్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తరఫున కూడా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సాధ్యమైనంతవరకు తగ్గించేందుకు అవకాశం ఉంటుందని



అన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రెండో రోజు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు, పెన్షనర్లు హాజరై తమ సమస్యల పరిష్కారానికి మార్గాలను పొందవచ్చని సూచించారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పెన్షన్, జీపీఎఫ్ సేవలకు సంబంధించిన సందేహాలు, వివిధాధానాలపై అవగాహన పెంపొందించుకుని తమ సమస్యలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అంతకుముందు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (అకౌంట్స్ అండ్ ఎంటైటిల్మెంట్స్), ఆంధ్రప్రదేశ్ శ్రీమతి శాంతి ప్రియ మాట్లాడుతూ, ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పెన్షన్ పొందడం వారి హక్కు అని, ఆ ప్రయోజనాలను సక్రమంగా అందించడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఏజీ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు.పెన్షనర్లు, జీపీఎఫ్ చందాదారులకు న్యాయం చేయడం, వారి సమస్యలను పరిష్కరించడం ఏజీ కార్యాలయ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పెన్షన్, జీపీఎఫ్‌కు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రైల్వే ఉద్యోగులకు కేంద్రం పండగ కానుక..

దసరా, దీపావళి పండగల సీజన్‌కు ముందు భారతీయ రైల్వే ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైల్వే శాఖలోని నాన్-గెజిటెడ్ ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ఉత్పాదకత ఆధారిత బోనస్ ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా దాదాపు 11.40 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ఈ బోనస్ రైల్వే శాఖలోని గ్రూప్-సి ఉద్యోగులకు వర్తిస్తుంది. వీరిలో ట్రాక్ మెయింటెనర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్ వంటి కీలక సిబ్బంది ఉన్నారు. రైల్వేలలో వీరి పాత్రను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ ప్రోత్సాహకాన్ని ప్రకటించింది. బోనస్‌ను 78 రోజుల వేతనంగా లెక్కించినప్పటికీ, చెల్లింపుల పరిమితుల ప్రకారం ప్రతి ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 మాత్రమే అందుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైల్వేల పనితీరును పరిగణనలోకి తీసుకుని ఈ బోనస్‌ను ఖరారు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వేస్ రికార్డు స్థాయిలో 1,670 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడంతో పాటు, సుమారు 741 కోట్ల మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చింది. ఉద్యోగుల అంకితభావం, కృషిని గుర్తించి వారిలో స్ఫూర్తిని నింపేందుకే ఈ బోనస్‌ను అందిస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మెరుగైన పనితీరు కనబరిచేలా సిబ్బందిని ప్రోత్సహించడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొంది. బోనస్ చెల్లింపుల కోసం అవసరమైన నిధులను ఇప్పటికే కేటాయించినట్లు అధికారులు స్పష్టం చేశారు. పండగల వేళ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రైల్వే ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

యూపీఐ ద్వారా పెన్షన్ ఖాతా..

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఖాతా తెరవాలనుకునే వారికి గుడ్‌న్యూస్. ఇకపై 'భీమ్' పేమెంట్స్ యాప్ ద్వారా కేవలం మూడు దశల్లోనే పెన్షన్ ఖాతా ప్రారంభించవచ్చు. 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌పీసీఐ) అనుబంధ సంస్థ ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించింది. 'పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ' (పీఎఫ్ఆర్‌డీఏ) ప్రవేశపెట్టిన 'తత్కాల్ ఎన్‌పీఎస్' సదుపాయం ద్వారా బ్యాంకు శాఖకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఖాతా తెరవవచ్చు. ఈ సదుపాయం కోసం కొత్తగా ఎలాంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే బ్యాంకులో ధ్రువీకరించిన కేవైసీ వివరాల ఆధారంగా ఖాతా ప్రారంభించవచ్చు. వినియోగదారులు తమ పుట్టిన తేదీని నమోదు చేసి, అర్హత ఉన్న బ్యాంకు ఖాతాను ఎంచుకుని, యూపీఐ ద్వారా తొలి చెల్లింపు చేయాలి. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులకు ఈ సదుపాయం అందుబాటులో ఉంది. త్వరలో మరిన్ని బ్యాంకులను ఇందులో చేర్చనున్నారు. 18 నుంచి 85 ఏళ్ల మధ్య వయసున్న అర్హులైన భారతీయ పౌరులు కనీసం రూ.250 తొలి పెట్టుబడితో ఎన్‌పీఎస్ ఖాతా తెరవవచ్చు. ఆ తర్వాత చేసే చెల్లింపులు రూ.10 నుంచి ప్రారంభించవచ్చు. అయితే ఎన్‌పీఎస్ నిబంధనలు వర్తిస్తాయి. ఎన్‌పీఎస్ అనేది పీఎఫ్ఆర్‌డీఏ పర్యవేక్షణలో పనిచేసే పెన్షన్ పథకం. ఇందులో పెట్టుబడులను నియంత్రణ సంస్థ అనుమతించిన పెన్షన్ ఫండ్ మేనేజర్లు మార్కెట్ ఆధారిత నిధుల్లో పెట్టుబడి పెడతారు. వర్తించే నిబంధనల ప్రకారం పన్ను ప్రయోజనాలు కూడా పొందవచ్చు.

దేశం మొత్తం జంతర్ మంతర్‌గా మారుతుంది

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలపై ఆంక్షలు విధించడం, కాక్రోచ్ జనతా పార్టీ నేతలను అరెస్ట్ చేయడంపై ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ తీవ్రంగా స్పందించారు. బుధవారం ఆయన ఎక్స్ వేదికగా విడుదల చేసిన ఒక వీడియోలో, కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. నిరసన ప్రదేశాన్ని మార్చగలరేమో కానీ, ప్రజల గొంతును నొక్కలేరని ఆయన హెచ్చరించారు. జాతీయ జెండాతో జంతర్ మంతర్‌లోకి ప్రవేశించిన సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను పోలీసులు అరెస్టు చేసి, ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన సంగతి తెలిసిందే. ఈ చర్యను ప్రకాశ్ రాజ్ తీవ్రంగా ఖండించారు. “మీరు నిరసన స్థలాన్ని మార్చగలరు, నిరసనను ఆపగలరు. కానీ ఈ దేశ ప్రజల గొంతును అణచివేయలేరు. దేశం మొత్తం జంతర్ మంతర్‌గా మారుతుంది” అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్యలను ప్రజలు సహించరని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటారని స్పష్టం చేశారు. గతంలో బెంగళూరులో జరిగిన సీజేపీ నిరసనలో తాను కూడా పాల్గొన్న విషయాన్ని ప్రకాశ్ రాజ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మాట్లాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఎలక్టోరల్ రోల్స్‌లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ కొంతకాలంగా ఆందోళనలు చేస్తోంది. ఇందులో భాగంగానే తాజా అరెస్టులు చోటుచేసుకున్నాయి.

దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నావ్?

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు ఢిల్లీలో చేదు అనుభవం ఎదురైంది. బుధవారం ఆయన ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఒక వ్యక్తి ఆయనను అడ్డుకుని నిలదీశారు. “దేశాన్ని ఎందుకు నాశనం చేస్తున్నారు?” అంటూ ఆ వ్యక్తి గట్టిగా అరవడంతో ఎయిర్‌పోర్ట్‌లో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే, దీప్కే మాత్రం నవ్వుతూ, నిరసనకారుడికి థమ్సప్ చూపిస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అక్టోబర్ 10న తన నానమ్మ మరణించడంతో స్వస్థలమైన మహారాష్ట్రకు వెళ్లిన దీప్కే, బుధవారం మధ్యాహ్నం తిరిగి రాజధానికి చేరుకున్నారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 10న నిరసనలకు నాయకత్వం వహించేందుకు వచ్చినప్పుడు కూడా పోలీసులు ఆయనను విమానం నుంచి అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఢిల్లీలో అడుగుపెట్టిన వెంటనే, తన సహచరులు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను అరెస్ట్ చేసి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపడంపై ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. “త్రివర్ణ పతాకాన్ని ఎగరేయడం నేరమా? కేవలం జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాను ఎగరేసినందుకే అశుతోష్, సౌరవ్‌లను ఐదు రోజులు జైలుకు పంపారు. గతంలో బ్రిటిష్ పాలనలో ఇలా జరిగేది. అప్పట్లో స్వాతంత్ర్య సమరయోధులు బహిరంగ ప్రదేశాల్లో జెండా ఎగరేస్తే అరెస్ట్ చేసి జైల్లో పెట్టేవారు” అని దీప్కే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

జనసేనలో చేరిన వంగవీటి రాధా..

మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు. ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

పెనుకొండ అక్టోబర్ 14 సీమ వార్త సాయంత్రం

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అర్హులకు ఆర్థిక సహాయం అందిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పెనుకొండలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 70 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.31,43,227 విలువైన సి ఎమ్ అర్ ఎఫ్ చెక్కులను ఆమె పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. పెనుకొండ నియోజకవర్గ పరిధిలో గత 28 నెలల్లో 1,461 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మొత్తం రూ.15 కోట్ల 75 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అర్హత కలిగిన పేదలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలో అర్హులైన వారికి పెన్షన్లు, గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి సవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్‌పై ఖాకీల డెగ నిఘా..!!



-మొదటిపేజీ తరువాయి

అవసరమైన వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కళ్యాణదుర్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా, రాకపోకల మార్గాలు, మౌలిక వసతులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ టి. దైవప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మంజుల, అర్బన్ సీఐ హరినాథ్, రూరల్ సీఐ గంగాధర్, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ లను పరిశీలించిన డిఎస్పి



గోరంట్ల అక్టోబర్ 14 సీమ వార్త సాయంత్రం. పట్టణంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ ఆవరణ మరియు బాలికల హైస్కూల్ ఆవరణలోని పోలింగ్ బూతులను బుధవారం పెనుగొండ డిఎస్పి రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సీఐ బోయ శేఖర్ ఆయన వెంట ఉన్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ బూత్ లు ఎలా ఉన్నాయి అక్కడ ఉన్నటువంటి ఏర్పాట్లు మరియు వాటి భద్రత నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ రోజు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన బందోబస్తు మరియు అన్ని మౌలిక సదుపాయాలు ఉండేలా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఆయన సూచించారు.

విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయనగరం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం కోసం వైసీపీ కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన తన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కి రాజకీయంగా చెక్ పెట్టేందుకు, సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఈసారి బీసీ (మహిళ)కు రిజర్వ్ చేశారు. ఇదే ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువుగా మారింది. గతంలో వైసీపీ తరఫున జెడ్పీ చైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను, ఇప్పుడు టీడీపీ కూటమి తరఫున తన కుమార్తె సిరి సహస్రను బరిలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను దూకుడుకు కళ్లెం వేయాలంటే, బొత్స కుటుంబం నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని వైసీపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వృత్తిరీత్యా డాక్టర్ అయిన బొత్స అనూషను చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బొత్స అనూష భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకవేళ పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆమె విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ బరిలో నిలవడం ఖాయమని చెబుతున్నారు. ఇదే జరిగితే విజయనగరం జెడ్పీ ఎన్నికల పోరు, బొత్స కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష పోరుగా మారి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించడం ఖాయం.

మోగిన నగారా!

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు. రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

సీమ వార్త సాయంకాలం
బుధవారం
14 అక్టోబర్ 2026

పుట్టపర్తి పురపాలక సంఘంలో 28 వార్డుల పునర్విభజన ఖరారు

కొత్త ప్రాంతాల విభజనతో పాటు కేటాయింపుల వివరాలు విడుదల

బలహీన వర్గాలు, మహిళలకు 14 వార్డులు

పుట్టపర్తి, అక్టోబర్ 14 (సీమవార్త సాయంకాలం బ్యూరో) : పుట్టపర్తి పురపాలక సంఘంలో 28 వార్డుల పునర్విభజన ప్రక్రియ పూర్తయింది. అధికారులు వార్డుల వారీగా ప్రాంతాల విభజనతో పాటు కేటాయింపు వివరాలను విడుదల చేశారు. విడుదలైన వివరాల ప్రకారం 1వ వార్డు సాయి నగర్ ను ఎస్సీ-జనరల్ గా, 2వ వార్డు కోట వీధిని ఎస్సీ-జనరల్ గా నిర్ణయించారు. 3వ వార్డు కే.ఎన్ పల్లి రోడ్ మరియు సాయి నగర్ గ్రౌండ్ ఏరియాను బీసీ-జనరల్ గా, 4వ వార్డు పెద్దబజార్ ను బీసీ-జనరల్ గా ఖరారు చేశారు. 5వ వార్డు శివాలయం వీధి, 6వ వార్డు గోవిందపేట మరియు తారకరామ నగర్ లను ఓసీ-జనరల్ గా నిర్ణయించారు. 7వ వార్డు కుమ్మరపేట మరియు క్యాంటీన్ వెనుక ప్రాంతం, 8వ వార్డు బీఎస్ఎన్ఎల్ కార్యాలయ రోడ్ మరియు వివేకానంద రోడ్, 9వ వార్డు ఎస్బీఐ రోడ్, సమాధి రోడ్ లను ఓసీ-మహిళకు కేటాయించారు. 10వ వార్డు కేఎన్ పల్లి - వివేకానంద రోడ్ షిర్డీ సాయి దేవాలయ ప్రాంతాన్ని బీసీ-జనరల్ గా, 11వ వార్డు కర్నాటక నాగేపల్లి (కేఎన్ పల్లి) ను బీసీ-మహిళ కేటాయింపుగా నిర్ణయించారు. 12వ వార్డు చిత్రావతి రోడ్-సమాధి రోడ్ ను ఓసీ-మహిళగా, 13వ వార్డు చిత్రావతి రోడ్ మరియు కల్పవృక్షం, 14వ వార్డు చిత్రావతి రోడ్, గుట్ట లను ఓసీ-జనరల్ గా ఖరారు చేశారు. 15వ వార్డు గోకులం మరియు సుబ్బమ్మ నగర్ ను బీసీ-మహిళగా, 16వ వార్డు బస్ డిపో ప్రాంతాన్ని ఓసీ-మహిళగా, 17వ వార్డు ఎనుములపల్లి చెరువు మరియు జడ్పీహెచ్ స్కూల్ ప్రాంతాన్ని ఓసీ-మహిళగా నిర్ణయించారు. 18వ వార్డు కోవెలగుట్టపల్లి మరియు రాయలవారి పల్లిని బీసీ-మహిళగా, 19వ వార్డు ఎనుములపల్లి బీసీ కాలనీని బీసీ-జనరల్ గా, 20వ వార్డు ఎనుములపల్లి ఎస్సీ కాలనీని ఎస్సీ-మహిళ కేటాయింపుగా ఖరారు చేశారు. 21వ వార్డు గణేష్ సర్కిల్ ను ఓసీ-మహిళగా, 22వ వార్డు బ్రాహ్మణపల్లిని బీసీ-మహిళగా నిర్ణయించారు. 23వ వార్డు బ్రాహ్మణపల్లి తండా మరియు బ్రాహ్మణపల్లి పార్ట్ ను ఎస్టీ-జనరల్ గా, 24వ వార్డు బీడుపల్లిని బీసీ-జనరల్ గా ఖరారు చేశారు. 25వ వార్డు బీడుపల్లి పార్ట్, బడేనాయక్ తండా మరియు గోనేనాయక్ తండాను ఎస్టీ-మహిళ కేటాయింపుగా నిర్ణయించారు. 26వ వార్డు ప్రశాంతి గ్రామ్ మరియు పెద్దకమ్మవారిపల్లి పార్ట్ ను ఓసీ-జనరల్ గా, 27వ వార్డు ప్రశాంతి గ్రామ్ ను ఓసీ-మహిళగా, 28వ వార్డు పెద్దకమ్మవారిపల్లిని ఓసీ-జనరల్ గా ఖరారు చేశారు. మొత్తం 28 వార్డుల్లో ఎస్సీ వర్గానికి 3, ఎస్టీ వర్గానికి 2, బీసీ వర్గానికి 9, ఓసీ వర్గానికి 14 వార్డులు దక్కాయి. ఇందులో మహిళలకు 14 వార్డులు కేటాయించారు.

కుంగిన సిమెంట్ రోడ్డు

-- ఇబ్బందులకు గురవుతున్న వాహన చోదకులు, పాదచారులు



సోమందేపల్లి అక్టోబర్ 14 సీమ వార్త సాయంకాలం మండల కేంద్రంలోని దుర్గా నగర్ లో సిమెంట్ రోడ్డు క్రుంగి పోయింది. గత ఆరు నెలల క్రితం రోడ్డు కృంగిపోగా వాహన చోదకులు మరియు పాదచారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, వికలాంగులు, పిల్లలు ఈ రహదారి గుండా వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నట్లు ప్రజలు తెలుపుతున్నారు. రాత్రి వేళలో ఇక్కడ వీధి దీపాలు లేకపోవడంతో మరింత ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు జక్కా ఆంజనేయులు, రామాంజనేయులు, మంజు, అశ్వర్థప్ప, సురేంద్ర, వెంకటనారాయణ పేర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు, పాలకులకు వినతుల ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మాతృశ్రీ వృద్ధాశ్రమంలో మెగా సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ జన్మదిన వేడుకలు.





అమడగూరు అక్టోబర్ 14 సీమ వార్త సాయంత్రం. సినీనటులు మెగా సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా కదిరి మెగా యూత్ ఫోర్స్ సభ్యులు అమడగూరులో మాతృశ్రీ వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య ఘనంగా నిర్వహించి వారికి భోజన సదుపాయం కల్పించారు.ఈ సందర్భంగా మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు శ్రీ మతి అరుణ మాట్లాడుతూ చిరంజీవి మేనల్లుడిగా సినీ రంగ ప్రవేశం చేసి తనకంటూ నటనలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని మరిన్ని విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మన్ననలు పొందాలని మెగా యూత్ ఫోర్స్ కదిరి టీమ్ వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ సాయి ధరమ్ తేజ్ కి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.మెగా యూత్ ఫోర్స్ కదిరి నియోజక వర్గం కన్వీనర్ దాసరి కార్తీక్ మాట్లాడుతూ ఆదరణకు నోచుకొని అభాగ్యులను ఒక తల్లి లాగ , ఒక చెల్లి లాగా , ఒక కూతురులాగా ఎంతో మంది వృద్ధులకు ఆశ్రయం కల్పించి వారికి సేవ చేస్తున్న మాతృశ్రీ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ జ్యోతి కి మా టీం తరపున అభినందనలు.మీ మధ్య మా అన్నయ్య మెగాస్టార్ చిరంజీవి మెగా మేనల్లుడు , సుప్రీమ్ హీరో సాయి ధరమ్ తేజ్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని మెగా కుటుంబం మరియు మెగా ఫ్యామిలీ అభిమానులు సేవా కార్యక్రమాలు చెయ్యడంలో ముందుంటారని చెప్పడానికి సంతోషిస్తున్నాం.మెగా సుప్రీం హీరో సాయి ధరమ్ తేజ్ కి మెగా యూత్ ఫోర్స్ తరపున హృదయ పూర్వక జన్మదిన శు భాకాంక్షలు.అలాగే మాకు ముందుండి దిశా నిర్దేశం చేస్తున్న మెగా యూత్ ఫోర్స్ జాతీయ కన్వీనర్ ఏడిద బాబీ కి , ఫౌండర్ సుస్మిత మేడం కి , రాష్ట్ర , జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కో కన్వీనర్ లక్ష్మణ కుటాల , జాయింట్ కన్వీనర్ మంగళమడక మనోహర్ , కమిటీ సభ్యులు హరిబాబు , కరము మిథున్ ,ముని గోపాల్ , వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

104 సేవలు సామాన్యులకు ఎంతో ప్రతిష్టాత్మకం

....ఉచితంగా రక్త పరీక్షలు, మందులు పంపిణీ





రొద్దం, అక్టోబర్ 14 (సీమవార్త సాయంకాలం): మండలంలోని పెద్దమంతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన 104 సేవలను దాదాపు వంద మంది సద్వినియోగం చేసుకున్నట్లు మెడికల్ ఆఫీసర్ బాబా ఫక్రుద్దీన్, ఎంపీహెచ్ఈఓ సుదర్శన్ బాబు తెలిపారు. షుగర్, బీపీ, గర్భిణీలు సహా పలువురు పేషెంట్లు ఈ సేవలను వినియోగించుకున్నారని, వారికి వైద్య సిబ్బంది షుగర్, బీపీ చెకప్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారని తెలిపారు.ఈ సందర్భంగా పేషెంట్లు మాట్లాడుతూ.. గతంలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటే మందులకే వెయ్యి నుంచి రెండు వేల రూపాయల వరకు ఖర్చయ్యేదని, ప్రస్తుతం ఒక్క పైసా ఖర్చు లేకుండా వైద్యం అందుతోందని తెలిపారు. ఇలాంటి రక్త పరీక్షలు ప్రైవేట్ ల్యాబ్‌లో చేయిస్తే వేల రూపాయలు ఖర్చవుతాయని, ఉచితంగా సేవలు అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేషెంట్లు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా చాకర్లపల్లి రైల్వే బ్రిడ్జి పనులు



సోమందేపల్లి అక్టోబర్ 14 సీమ వార్త మండల పరిధిలోని చాకర్లపల్లి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. గత ఏడేళ్లుగా పనులు జరగకపోవడంతో రైల్వే గేటు పడితే గంటల తరబడి ఉండాల్సిన పరిస్థితి.. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులుఎదుర్కొన్నారు.అనంతపురం, బెంగళూరు, హిందూపురం వైపు వెళ్లే వాహనదారులకు బ్రిడ్జి నిర్మాణంతో ఊరట లభించనుంది. నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే రాకపోకల సమస్యలు తీరనున్నాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పురం అడ్డాలో... తోబుట్టు లకు తోడుగా నవీన్ నిచ్చల్

...1000 మంది కీ మహిళలకు పసుపు కుంకం.





హిందూపురం అక్టోబర్ 14 సీమ వార్త సాయంత్రం. హిందూపురంలో విజయదశమి సందర్భంగా జనసేన నాయకుడు బి. నవీన్ నిశ్చల్ తన సొంత నిధులతో పార్లమెంట్ పరిధిలోని దాదాపు వెయ్యి మంది మహిళలకు నూతన చీరలు పంపిణీ చేశారు. సమాజ సేవే లక్ష్యంగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని తెలిపారు. ఇదే సందర్భంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకొని అన్యాయం చేశారని ఆరోపించారు.విజయదశమి పండుగ సందర్భంగా హిందూపురంలో జనసేన నాయకుడు బి. నవీన్ నిశ్చల్ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తన సొంత నిధులతో పార్లమెంట్ పరిధిలోని దాదాపు వెయ్యి మంది మహిళలకు నూతన వస్త్రాలు అందజేశారు. తాను ఏ పార్టీలో ఉన్నప్పటికీ ప్రతి ఏటా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సేవా స్ఫూర్తితోనే జనసేన పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.మరోవైపు వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై నవీన్ నిశ్చల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వైసీపీ కోసం ఎన్నో ఏళ్లు కష్టపడినా తనకు తగిన గుర్తింపు ఇవ్వకుండా రాజకీయంగా అన్యాయం చేశారని ఆరోపించారు. తన ఎదుగుదలను అడ్డుకునేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. వైసీపీ ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఓపికతో భరించానని, అవసరమైన సమయంలో ఆ పార్టీ చేసిన అన్యాయాలను ప్రజల ముందు బయటపెడతానని హెచ్చరించారు. హిందూపురంలో వైసీపీని రాజకీయంగా తుడిచిపెట్టేలా ముందుకు సాగుతానని, జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తానని నవీన్ నిశ్చల్ స్పష్టం చేశారు.విజయదశమి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే జగన్‌పై నవీన్ నిశ్చల్ చేసిన విమర్శలు హిందూపురం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

వర్ధంతి సందర్భంగా అగాపే ఆశ్రమంలో అన్నదానం



యాడికి అక్టోబర్ 14 సీమ వార్త సాయంకాలం యాడికి మండల కేంద్రం కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో కాసా నాగ ప్రతాప్ మొదటి వర్ధంతిని జ్ఞాపకం చేసుకుంటూ అతని తండ్రి కాసా వెంకటరంగడు తల్లి నాగమణి తమ్ముడు సాయి రంజిత్ నానమ్మ వెంకటలక్ష్మి తాతయ్య నాగరంగడు చిన్నాన్న నాగరాజు చిన్నమ్మ జ్యోతి తమ్ముళ్లు హరి చరణ్ చెల్లి నీళనందిని బాబాయ్ శేషన్న మరియు తలారి రామాంజనేయులు వీరి కుటుంబమంతా కాసా నాగ ప్రతాప్ జ్ఞాపకార్థమై ఆశ్రమంలో వృద్ధులకు నిరాశ్రయులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఇందు నిమిత్తమై ఆశ్రమం బత్తల ప్రసాద్ ఆశ్రమంలోని వారంతా వారి కుమారుడు నాగ ప్రతాప్ లేని లోటు ఆ కుటుంబానికి తీరాలని దేవుని ప్రార్థిస్తూ వారికి అభినందనలు తెలిపారు.

యాడికి మండలంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తాడిపత్రి డీఎస్పీ చంద్రశేఖర్

సీఐ శ్రీనివాసులు

ఎన్నికల నిర్వహణకు పోలీసు భద్రతా ఏర్పాట్లపై తనిఖీలు



యాడికి అక్టోబర్ 14 సీమ వార్త సాయంకాలం యాడికి మండల పరిధిలోని వేములపాడు నగరూరు వెంగన్నపల్లి పుప్పాల తూర్రాలపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లను డీఎస్పీ చంద్రశేఖర్ సీఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లపై పోలీసు అధికారులు పరిశీలన చేపట్టారు ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేలా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు.

నవీన్ నిచ్చెల్ ని కలసిన....గోరంట్ల జనసేన నాయకులు.



గోరంట్ల అక్టోబర్ 14 సీమ వార్త సాయంత్రం. ఇటీవలే జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీ లోకి చేరిన నవీన్ నిచ్చేల్ ని ఆయన నివాసం లో మర్యాద పూర్వకంగా కలిశారు అలాగే హిందూపురం పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయ కర్త గా ఎన్నికైన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి పెనుకొండ నియోజకవర్గం లో స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ కి రావాల్సిన వాటా గురించి చర్చించడం జరిగింది ఈ కార్యక్రమం లో ఉమ్మడి అనంతపురం జిల్లా సంయుక్త కార్యదర్శి చిలమత్తూరి వెంకటేష్. పెనుకొండ నియోజకవర్గం స్థానిక సంస్థల సమన్వయ కర్త గొల్ల అనిల్ కుమార్. మండల నాయకులు సింగిరెడ్డి పల్లి రమేష్. దేవుల చెరువు రమేష్. హేమంత్. వినయ్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Pulished, Owned by BEEREA ESWARAYYA & Printed at M/S ESWAR Offset Printers D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P.
RNI No: APTEL /25/A2860 & Published at D.No. 1-1756, Chowdeswary Colony, Gorantla, Sri Sathya Sai (Dt)A.P. Editor B. ESWARAYYA Cell :9490860881